రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

శాంతి భద్రతలను కాపాడేందుకు

మరిన్ని ఏర్పాట్లు

- శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి
- షాద్‌నగర్ కేంద్రంలో రూరల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు
- నేరాల నియంరతణకు మరో రెండు విభాగాల కోసం ఇన్‌స్పెక్టర్ల ఏర్పాటుకు పరిశీలిన

రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, తదితరులు

షాద్‌నగర్, అక్టోబర్ 19, (ప్రభాతవార్త) :
షాద్‌నగర్ నియోజకవర్గంలో నేరాలను ఎప్పటికప్పుడు నియంత్రిస్తూ, శాంతి భద్రతలను పకడ్బంధీగా కాపాడేందుకు మరిన్ని వెసులుబాటులతో పాటు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నట్లు శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో షాద్నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇది వరకు కొత్తూరు మండల కేంద్రంలో ఉన్న ఈ సేవలను ఇకపై షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. దాత మహర పుష్ప ఆగ్రి ప్రోడక్ట్ లిమిటెడ్ యజమాని రాకేష్ అగర్వాల్ చేతుల మీదుగా రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఏసీపీ కుశాల్కర్, జిల్లా జడ్పీ వైస్ ఛైర్మన్ ఈట గణేష్, కేశంపేట ఎంపీపీ వై.రవీందర్‌యాదవ్, రూరల్ సీఐ సత్యనారాయణ, నందిగామ సీఐ రామయ్య, ఎస్సైలు వెంకటేశ్వర్లు, దేవకి, విజయ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... గతంలో సైబరాబాద్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర పోలీస్‌స్టేషన్‌ను సందర్శించినప్పుడు ఆయా సమస్యలను స్వయంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే కొత్తూరులో ఉన్న రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ప్రజల అవసరాలకు అనుగుణంగా షాద్‌నగర్‌లోకి మార్పు చేయడం జరిగిందన్నారు. ప్రజల పాలన సౌలభ్యం కోసమే దీనిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు కేశంపేట, కొందూర్గు, చౌదరిగూడ మండలాలకు చెందిన వారు ఇక్కడ ఫిర్యాదులు చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం పరిపాలనకు అనువుగానే సిబ్బంది సౌకర్యం ఉందని స్పష్టం చేశారు. శాంతిభద్రతల మెరుగు కోసం లా అండ్ ఆర్డర్ మరో సీఐ ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా నేరాలు జరుగుతున్న దృశ్య సిబ్బంది సంఖ్యను పెంచేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా షాద్‌నగర్ పట్టణానికి మరో రూరల్ పోలీష్‌స్టేషన్ ఆవశ్యకత పరిశీలనలో ఉందన్నారు. త్వరలోనే నందిగామ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆశరణలో 26 సీసీ కెమెరాలకు సంబంధించిన గదిని డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఏసీపీ కుశాల్కర్ నేతృత్వంలో అన్ని పోలీస్ స్టేషన్లలో నేరాల నియంతణ్రకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, వైస్ ఛైర్మన్ నటరాజన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూరు విశ్వం, సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ జోడో యాత్రను విజయవంతం చేద్దాం...

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్

షాద్‌నగర్, అక్టోబర్ 19, (ప్రభాతవార్త) :
తెలంగాణలో అడుగు పెట్టబోతున్న రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం ఈ మేరకు ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ... దేశంలోని మోడీ పాలను, రాష్ట్రంలోని కేసీఆర్ పాలనను తరిమి కొట్టడానికే రాహుల్ గాంధీ పాదయాత్ర చేపట్టారని, ఈ పాదయాత్రకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకులు, అభిమానులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు అధికంగా తరలి వచ్చి పాదయాత్రను ఘన విజయం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా గ్రామ గ్రామాన ప్రతి గడపకు రాహుల్ గాంధీ పాదయాత్ర యొక్క ముఖ్యఉద్దేశాన్ని వివరించాలని ఆయన తెలిపారు. వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ నియోజకవర్గంలో రాహుల్ గాంధీ జోడో యాత్రను విజయవంతం చేయడానికి సర్వం సిద్ధం చేశామని ఆయన తెలిపారు.

కల్తీగాళ్ళు...

-కల్తీ అల్లం వెల్లుల్లీ ఫేస్ట్..150 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు
-వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి

విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి

స్వాదీనం చేసుకున్న కల్తీ అల్లం వెల్లుల్లి ఫేస్టు డ్రమ్ములు

వికారాబాద్, అక్టోబర్ 19, ప్రభాతవార్త:
ఆహార పదార్థాలను కల్తీ చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు కొందరు కల్తీగాళ్ళు. కల్తీగాళ్ళను పట్టుకుని ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తున్నారు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు. ప్రతినిత్యం వంటల్లో వినియోగించే అల్లం వెల్లుల్లి ఫేస్టును తయారు చేస్తున్న కల్తీగాళ్ళను జిల్లా టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. అదేవిధంగా అక్రమంగా తరలిస్తున్న 150 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని సైతం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీ మోమిన్‌పేట్ మండలం మొరంగపల్లి చౌరస్తాలో జిల్లా టాస్క్‌ఫోర్సు సీఐ వెంకటేశం, ఎస్ఐ విజయ్‌ప్రకాష్‌లు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తున్నారు. అటుగా ఒక ఆటోలో వికారాబాద్ ఆలంపల్లికి చెందిన గుడుగు వినయ్‌కుమార్ కల్తీ అల్లంఫేస్టు ఉన్న డబ్బాలను తరలిస్తూ పట్టుబడ్డాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా, నగరంలోని షేక్ ఇక్బాల్, ఎండి.సమీరోద్దీన్ వ్యక్తుల వద్ద నుంచి 50 కిలోల డ్రమ్‌లను కిలో రూ.20 చొప్పున కొనుగోలు చేసి ఎక్కువ ధరకు వినియోగదారులకు విక్రయిస్తానని పోలీసులకు నింధితుడు వినయ్‌కుమార్ తెలిపారు. దీంతో షేక్ ఇక్బాల్, ఎండి.సమీరోద్దీన్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా, అల్లం వెల్లుల్లి ఫేస్టు తయారీకి అల్లం వినియోగించకుండా, కెమికల్ తయారీతోనే అల్లం వెల్లుల్లి ఫేస్టు తయారీ చేస్తామని పోలీసులకు తెలిపారు. నింధితుల వద్ద నుంచి 50 కిలోల 23 డ్రమ్ముల కల్తీ అల్లం వెల్లుల్లి ఫేస్టులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నింధితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 150 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న నింధితులను టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని నయారా పెట్రోల్ పంపు దగ్గరలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో..మోమిన్‌పేట్ సీఐ వెంకటేశం, ఎస్ఐ విజయ్‌ప్రకాష్ లు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. తాండూరు రహమత్‌నగర్‌కు చెందిన మీర్జా అజర్‌బేగ్, మాణిక్‌నగర్‌కు చెందిన ఎస్.కె.షేక్ లు ఏపీ 02 డబ్ల్యూ 2389 నెంబరు గల లారీలో 150 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని నల్ల బజారు తరలిస్తున్నారు. నింధితులను అదుపులోకి తీసుకుని విచారించగా, రేషన్ బియ్యాన్ని ప్రజల వద్ద నుంచి కిలో రూ.10 చొప్పున కొనుగోలు చేసి కిలో రూ.14 చొప్పున నల్ల బజారులో విక్రయిస్తామని పోలీసులకు తెలిపారు. వారి వద్ద నుంచి లారీతో సహా 150 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుని నింధితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు వెంకటేశం, టంగుటూరి శ్రీనివాస్, ఎస్ఐ విజయ్‌ప్రకాష్ తదితరులు ఉన్నారు.

పెద్దగొల్కొండ జంక్షన్‌లో నిలిచిన నీరు దృశ్యం

భారీ వర్షంతో రాకపోకలు నిలిపివేత

శంషాబాద్ అక్టోబర్19,ప్రభాతవార్త :
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డు శంషాబాద్ పరిధిలోని పెద్ద గోల్కొండ జంక్షన్ వద్ద అస్తవ్యస్తంగా మారింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నెంబర్ 15 పూర్తిగా జలమయం అయింది.చిన్న చిన్న వాహనాలే కాకుండా భారీ వాహనాలు సైతం తిరగలేని పరిస్థితి ఏర్పడింది.దీనితో ఔటర్ రింగ్ రోడ్డు అధికారుల పెద్ద గోల్కొండ జంక్షన్ వద్ద వాహనాలు రాకపోకలను పూర్తి నిలిపివేశారు.మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పెద్ద గోల్కొండ గ్రామ పరిధిలో ఉన్న బైరమోని చెరువు నిండి వరద ప్రవాహం రావడంతో పాటు మహేశ్వరం మండలంలోని పలు చెరువులు కూడా నీటితో నిండి వరద పోటెత్తింది.దీనితో మరో వారం పది రోజుల వరకు ఈ జంక్షన్ వద్ద రాకపోకలు పూర్తిగా నిలిచిపోనున్నాయి.గతంలో కూడా ఈ జంక్షన్ వద్ద వాల్స్ నీరు నిండి వాహనాలు నడవలేని స్థితిలో ఉండడంతో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.అయినప్పటికి దానివలన ఎలాంటి సత్ఫలితాలు కలగలేదు.మహేశ్వరం మండలం శంషాబాద్ మండలాల మధ్యన రాకపోకలు సాగించడానికి పెద్ద గోల్కొండ జంక్షన్ మాత్రమే ఉపయోగించుకోవాల్సి ఉంటుంది.నడుముల లోతు వరకు నీరు నిలిచి ఉండడంతో వాహనాలు తిరగలేని పరిస్థితి ఏర్పడింది.అనేక గ్రామాల ప్రజలు కాలినడకన కూడా అటు నుండి ఇటు నుండి అటు వెళ్లలేని దుస్తితి ఏర్పడింది. సంబంధిత అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకొని రాకపోకలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.దీనితో పాటు హమీదుల్లా నగర్ నుండి శంషాబాద్ వరకు ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వేల కోట్ల రూపాయలు పెట్టి రింగ్ రోడ్డు నిర్మించిన అధికారులు రెండు మూడు కిలోమీటర్ల పరిధిలోని సర్వీస్ రోడ్డు నిర్మించపోవడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాల్టీలో "చెత్త" గోల

- డంపింగ్‌యార్డ్‌లో నిండిపోయిన చెత్త
- చేతులెత్తేసిన అధికారులు
- వార్డులలో చెత్త సేకరించేందకు వెనుకడుగువేస్తున్న సిబ్బంది
- అధికారులు, పాలకుల తీరుపై మండిపడుతున్న ప్రజలు

డంపింగ్ యార్డులో వేసిన చెత్త(ఫైల్ ఫోటో).

తాండూరు, అక్టోబరు 19, ప్రభాతవార్త :
వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపాల్టీలో చెత్త గోల నెలకొంది. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తాండూరు మున్సిపాల్టీ మారిపోయింది. రూ. కోట్లాధి నిధులు ఖజానాలో మూలుగుతున్నా.. అభివృద్ధికి మాత్రం ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం డంపింగ్‌యార్డ్‌లో చెత్త పూర్తిగా నిండిపోయింది. పట్టణంలో ఇంటింటికి సేకరించిన చెత్త డంపింగ్‌యార్డ్‌లో వేసేందుకు చోటులేకుండాపోయింది. దీంతో మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని వార్డులలో చెత్త సేకరించేందకు వెనుకడుగువేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ట్రాక్టర్లు, ఆటోలలో చెత్త సేకరించినా ఎక్కడవేయాలో తెలియడం లేదు. గతంలో కూడ డంపింగ్‌యార్డ్ పూర్తిగా నిండిపోతే అధికారులు జేసీబీ పెట్టి చెత్తను ఒకవైపుకు నెట్టించారు. ప్రస్తుతం అధికారులు కూడ చేతుతలెత్తేశారు. జెసీబి పెట్టించి చెత్తను తొలగించాలంటే డబ్బులు కావాలని, ప్రస్తుతం మున్సిపల్ బడ్జెట్‌కు సంబంధించి ఫైల్ కోర్టు పరిధిలో ఉందని, తమ వ్యక్తిగతంగా చేతుల నుండే డబ్బులు వెచ్చించాల్సి వస్తుందని, ప్రస్తుతం ఏమీ చేయలేమంటూ అధికారులు చేతులెత్తేశారు. మరోవైపు తాండూరు మున్సిపల్ అభివృద్ధి విషయంలో అధికారులు, పాలకుల చూపుతున్న తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. పట్టణ అభివృద్ధిపై పట్టింపులేకుండా పోయిందని విమర్శిస్తున్నారు. వార్డులలో పారిశుధ్య వ్యవస్థ అస్థవ్యస్థంగా మారిందని, పలు వార్డులలో వీధిలైట్లు కూడ వెలగడం లేదని, మిషన్ భగీరథ కోసం తీసిన గుంతల తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు పంతాలు వీడి పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

పేదలకు వరంగా మారిన సిఎం సహాయనిధి

కొత్తూర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త :
ప్రజాసంక్షేమంలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తున్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ తెలిపారు. కొత్తూర్ పురపాలిక పరిధిలోని తిమ్మాపేర్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డికు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60వేల విలువ గల చెక్కును మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ చెక్కును అందజేశారు. గత కొన్ని రోజుల క్రితం విష్ణువర్ధన్ ఆనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు వారి ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో స్థానిక ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, దృష్టికి తీసుకుపోగా వారు వెంటనే స్పందించి ప్రత్యేక చొరవతో సీఎం సహాయనిధి ద్వారా అతనికి మంజూరైన చెక్కును బాధితుని తల్లికి బుధవారం చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్ చేతుల మీదుగా ఆమెకు అందజేశారు. అనంతరం చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ మాట్లాడుతూ.... సీఎం కేసీఆర్ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. సీఎం సహాయనిధి నిరుపేదల పాలిపరంగా మారాయన్నారు. సీఎం సహాయనిధితో పేదలు కార్పోరేట్ వైద్యాన్ని పొందుతున్నారన్నారు.కార్యక్రమంలో వైస్ చైర్మెన్ డోలి రవీందర్, ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్, కౌన్సిలర్ బ్యాగరి ప్రసన్నలతయాదయ్య, రేనట్ల దేవేందర్ గౌడ్, దాసరి నరసింహ్మా, సిటీ కేబుల్ వెంకటేష్, బిజిలి రఘు, సాయి ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న చైర్‌పర్సన్

వైద్యాధికారులు సమయ పాలన పాటించాలి

-వారంలో రెండు రోజులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలి
-జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో వైద్యాధికారులు, ప్రోగామ్ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్,పాల్గొన్న తదితరులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 19, ప్రభాతవార్త
జిల్లాలోని వైద్యాధికారులు అందరు సమయ పాలన పాటించాలని, వారంలో ప్రతి బుధవారం, శనివారంలలో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ వారిని ఆదేశించారు. బుధవారం మేడ్చల్ జిల్లా నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యాధికారులు,ప్రోగ్రామ్ అధికారులతో సమీక్ష సమావేశంను డిఎంఅండ్‌హెచ్‌ఓ నిర్వహించారు. ఈ సందర్భంగ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో ఇమ్యునైజేషన్, సబ్‌సెంటర్, కార్యకలాపాలను కూడ పర్యవేక్షించాలని వైద్యాధికారులకు స్పష్టం చేశారు. 9నుంచి 4గంటల మధ్య పేషంట్స్ హెల్త్ కేర్ సేవలను విడిచిపెట్టి జిల్లా కార్యాలయాన్ని సందర్శించవద్దని, అవసరమైతే కార్యాలయ అసిస్టెంట్ లేదా అకౌంటెంట్‌ను పంపాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను మెరుగు పర్చాలన్నారు. కెసిఆర్ కిట్స్ 1వ త్రైమాసిక రిజిస్ట్రేషన్లను అప్‌డేట్ లు 95శాతం కన్నా ఎక్కువగా ఉండాలన్నారు. ప్రసవాల తనిఖీ 100శాతం ఉండాలన్నారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంపై జిల్లాలోని ఎస్‌టిఎల్‌ఎస్, ఎస్‌టిఎస్‌లతో నేరుగా లబ్దిదారుల బదిలీ గురించి సమీక్షించామన్నారు. వందశాతం డిబిటిని సాధించాలని వారిని ఆయన ఆదేశించారు. రాత్రి 9నుంచి4 గంటల మధ్య ఏ మెడికల్ ఆఫీసర్ ప్రైవేట్ ప్రాక్టీస్ చేయకూడదని, వారి విధుల పట్ల అంకితభావంతో ఉండాలన్నారు. అన్ని బస్తీ దావాఖానాలు తెలంగాణ డయాగ్నోస్టిక్స్ టెలికన్సల్టేషన్‌లు,ఇ ఔషది అప్‌డేషన్‌లను పెంచాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి వైద్యాధికారులు సి-సెక్షన్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. జిల్లాలో సి-సెక్షన్ శాతాన్ని తగ్గించాలని ఆదేశించారు. మేడ్చల్ జిల్లాలో 100శాతం సాధారణ ప్రసవాలే లక్ష్యంగా పనిచేయాలని వైద్యాధికారులకు సూచించారు. గర్భిణీ స్త్రీల వివరాలను ఆశావర్కర్లు, అంగన్‌వాడి కార్యకర్తలు నమోదు చేస్తున్నారని, బిడ్డ ప్రసవం అయ్యేవరకు ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికపుడు తనిఖీ చేయాలన్నారు. బర్త్ ప్లానింగ్ క్రమం తప్పకుండ చేయాలని, 100శాతం చేరుకోవాలన్నారు. ఐరన్ పోలిక్ యాసిడ్ (ఐఎఫ్ఎ) టాబ్లెట్ల వినియోగం 100శాతం ఉండాలని, కెసిఆర్ కిట్ పోర్టల్‌లో కూడ అప్ డేట్ చేయాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మాస్ ప్రోగ్రామ్ అధికారి జి.వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, సిహెచ్‌ఓ, పిహెచ్‌ఎన్, పల్లె దావాఖానా, బస్తీ దావాఖానా వైద్యులు,సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

.జిల్లా సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది, తదితరులు

రోడ్డు చిద్రం...ప్రయాణం నరకం

-వర్షానికి గుంతల మయంగా మారిన రోడ్డు
-ఇబ్బందులు పడుతున్న వాహన దారులు
-పట్టించుకోని అధికారులు

బీటి రోడ్డుపై ఏర్పడిన గుంత

కంకర తేలిన బీటి రోడ్డు

జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్19,(ప్రభాతవార్త):
గత కొన్ని రోజులుగ కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల రోడ్లు పూర్తిగ గుంతల మయంగ తయారైయాయి. రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహన దారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్న బీటి రోడ్లు ప్రస్తుతం మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. వర్షాలు కురువడం వల్లన రోడ్డులో మొత్తం గుంతలు ఏర్పడి ప్రమాదకరంగ మారాయి. రోడ్లకు కొన్ని సంవత్సరాల నుంచి మరమ్మత్తులు చేయకపోవడం వల్లన పూర్తిగా గుంతల మయంగ మారాయని మండల వాసులు వాపోతున్నారు.

గుంతల మయంగ బీటి రోడ్లు

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలకు ఉన్న బీటి రోడ్లు మొత్తం గంతల మయంగ మారాయి. జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్ నుంచి చేగిరెడ్డి ఘనూపర్ మీదుగ చలివేంద్రం పల్లి వరకు ఉన్న బీటి రోడ్డు గుంతల మయంగ మారింది. చేగిరెడ్డి ఘనాపూర్ చౌరస్తా నుంచి గాలిగూడ వరకు ఉన్న బీటి రోడ్డు కంకర తేలి మెటల్ రోడ్డును తలపిస్తుంది. జాకారం చౌరస్తా నుంచి మల్కపహాడ్ తాండ వరకు ఉన్న రోడ్డుపై గుంతలు, కంకర తెలడం వల్లన ద్విచరక్ర వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కురుస్తున్న వర్షాల వల్లన రోడ్డుపై ఉన్న గుంతలు రోజు రోజురు పెద్దవిగా మారుతున్నాయి. దీంతో వాహన దారులు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయాల్లో రోడ్డుపై ఉన్న గంతలలో నీరు ఉండడం వల్లన ఎక్కడ గుంతలు ఉన్నయో తెలయని పరిస్థితులు నెలకొంటున్నాయని మండల వాసులు అంటున్నారు. మండలంలోని కొన్ని రోడ్లు మరమ్మత్తులు చేసేందుకు నిధులు మంజురు అయిన్నప్పటికి ప్రస్తుతం పనులు జరగడం లేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి మండలంలో గుంతల మయంగ మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలని మండల వాసులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ అమ్మవారి బోనాల పండుగ

-ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి వైనం
-దర్శించుకున్న భక్తజనం

.శామీర్‌పేట గ్రామం నుంచి శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా బోనాలతో వెళ్తున్న మహిళలు,భక్తజనం

శామీర్‌పేట, అక్టోబరు 19, ప్రభాతవార్త
శామీర్‌పేటలో శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారి బోనాల పండుగను బుధవారం ప్రజలు ఘనంగ జరుపుకున్నారు. బుధవారం సాయంత్రం శామీర్‌పేట గ్రామం నుంచి బోనాలను ఊరేగింపుగా శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంకు వెళ్లి అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శామీర్‌పేట గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో 5వ వార్షికోత్సవం సందర్భంగ మూడు రోజుల నుంచి శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతున్న సంగతి తెలిసిందే. మంగళవారం అమ్మవారి కల్యాణోత్సవాన్ని ఘనంగ నిర్వహించుకున్న సంగతి విధితమే. బుధవారం అమ్మవారి బోనాల పండుగను భక్తులు ఉత్సాహంగ జరుపుకున్నారు. బోనాల పండుగ సందర్భంగ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శామీర్‌పేటలో ప్రతి ఏటా శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారి మహోత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఉదయం భక్తులు పలువురు అమ్మవారిని దర్శించుకుని పలువురు ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగ ప్రత్యేక పూజలు నిర్వహించుకోవటం జరిగింది. శ్రీరేణుకా ఎల్లమ్మ పండుగ సందర్భంగ శామీర్‌పేట గ్రామం భక్తిపాటలతో, భక్తిశ్రద్ధలతో పండుగను ఘనంగా జరుపుకున్నారు. దీనిలో శామీర్‌పేట గౌడ సంఘం వారితో పాటు శామీర్‌పేట గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సభ్యులు, గౌడ సంఘం కుటుంబ సభ్యులు,బంధులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. శామీర్‌పేట రాజీవ్‌రహదారి పక్కన ఉన్న శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారి ఆలయ ప్రాంగణం అంతా భక్తి పారవశ్యంతో భక్తి పాటలతో మారుమోగింది.

మునుగోడులో బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలి

మునుగోడు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్

కీసర, అక్టోబర్19, ప్రభాతవార్త:
మునుగోడులో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని దమ్మాయి గూడ మున్సిపాలిటీ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ కోరారు. మంగళవారం మునుగోడు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరుతూ గడప గడప తిరుగుతూ మహిళలకు తిలకం దిద్దుతూ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్, బిజేపి పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని తెలిపారు. తెలంగాణా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజలకు కేసీఆర్ న్యాయం చేస్తున్నారన్నారు. పేద ప్రజలకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ మునుగోడు అభివృద్ధికై బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరుతూ మహిళలతో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. వృద్ధులకు పెద్ద కొడుకుగా కేసీఆర్‌ని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుజాత, జవహర్ నగర్ మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ లక్ష్మీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ డయాగ్నస్టిక్స్ ప్రారంభం

కీసరలో లయన్స్ క్లబ్ డయాగ్నస్టిక్స్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్

కీసర, అక్టోబర్19, ప్రభాతవార్త:
గ్రామీణ ప్రాంత ప్రజలకు అతి తక్కువ ధరలకు రక్త పరీక్షలు చేయాలని సర్పంచ్ మాధురి వెంకటేష్ అన్నారు. మండల కేంద్రమైన కీసరలోని కీసర లయన్స్ క్లబ్ డయాగ్నస్టిక్స్, రక్త పరీక్షలు చేయు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లో నిరుపేద ప్రజలకు అతి తక్కువ ధరలకు అన్ని రకాల పరీక్షలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని కీసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి బెలిదె రమేష్‌గుప్తా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి జంగయ్య ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు జంగయ్య యాదవ్

ఘట్‌కేసర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త:
ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్‌కు చెందిన కమ్మరి వెంకటేశ్ అనారోగ్యంతో మృతిచెందగా ఆర్థికసాయం అందజేసినట్లు మున్సిపల్ టిఆర్ఎస్‌పార్టీ నాయకులు ముల్లి జంగయ్యయాదవ్ తెలిపారు. పేదకుటుంబానికి చెందని వెంకటేశ్ అనార్యోగంతో అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు తీరని బాధతో ఉన్నారని వారిని బుధవారం పరామర్శించి తనవంతుగా రూ.5,000లు అందజేసినట్లు చెప్పారు. పేదకుటుంబం అంత్యక్రియలు చేయాలంటే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని దాతలు మృతుని కుటుంబానికి తోచిన ఆర్థికసాయం అందించేందుకు ముందుకురావాలని ఆయన కోరారు. నాయకులు వెంకటచారీ, సలీం, జావీద్ ఉన్నారు.

పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్న సిఎం రిలీఫ్ ఫండ్

అలియాబాద్ గ్రామానికి చెందిన బాధిత మహిళకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేసిన శామీర్‌పేట మండల రైతుబంధు అధ్యక్షులు కె.కృష్ణారెడ్డి, పాల్గొన్న తదితరులు

శామీర్‌పేట, అక్టోబరు 19, ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సిఎం రిలీఫ్ ఫండ్ పేదలను ఆర్థికంగ ఆదుకుంటున్నట్లు శామీర్‌పేట మండల రైతుబంధు అధ్యక్షులు కె.కృష్ణారెడ్డి తెలిపారు. పేదలకు ఆర్థికంగ సిఎం రిలీఫ్ ఫండ్ భరోసా కల్గిస్తుందని ఆయన అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్‌లో బాధిత మహిళకు చెక్కును ఆయన అందజేశారు. అలియాబాద్ గ్రామానికి చెందిన బాధితురాలు పోచంపల్లి బాలమణికి అనారోగ్యంతో బాధడుతూ వైద్యసేవలు, పరీక్షల నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి 35వేల రూపాయలు ఆర్థిక సహాయంగా మంజూరు అయినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ఆర్థిక స్థోమత లేని వారికి సిఎం రిలీఫ్ ఫండ్ దోహదపడుతుందని ఆయన అన్నారు. దీనిలో ఆయనతో పాటు గ్రామ వార్డుసభ్యులు లింగం, టిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, బిసి సెల్ అధ్యక్షులు మన్మదచారి, ఇమ్రాన్, పి.శ్రీనివాస్, పాల్గొన్నారు.

మృతురాలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 19, ప్రభాతవార్త:
మండలంలోని కొర్రెములలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పసులాది పెంటమ్మ కుటుంబ సభ్యులకు బుధవారం గ్రామ సర్పంచ్ ఓరుగంటి వెంకటేశ్ గౌడ్ పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. మృతురాలు కుటుంబ సభ్యులు కడుబీదవారు కావడంతో పదివేల రూపాయలను దశదీన కర్మ నిమిత్తం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ కందుల రాజు, పంచాయతీ వార్డు సభ్యులు ఎరుకల దుర్గారాజు గౌడ్, డి. ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ బొడ్డు నాగార్జున గ్రామ నాయకులు ఉడుగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొర్రెములలో ఇటీవల మృతి చెందిన పెంటమ్మ కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్ గౌడ్ తదితరులు.

వేగం కన్నా... ప్రాణం మిన్న...

- షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్
- విజయనగర్ కాలనీలోని సిసి రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

షాద్‌నగర్, అక్టోబర్ 19, (ప్రభాతవార్త) :
వాహనదారుల సౌకర్యార్థం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో నూతనంగా సీసీ రోడ్లను నిర్మిస్తున్నామని, అయితే కొంత మంది అతివేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురి అవుతున్నారని తమ దృష్టికి రావడంతో ప్రధానమైన రహదారుల్లో సీసీ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నామని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్ తెలిపారు. బుధవారం షాద్‌నగర్ పాతజాతీయ రహదారి నుంచి బైపాస్‌కు అనుసందానంగా ఉన్న విజయనగర్ కాలనీలోని సీసీ రోడ్డుపై స్వయంగా దగ్గరుండి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ... ప్రయాణీకులు వేగం కన్నా ప్రాణం మిన్న అనే విషయానికి గుర్తించుకొని వాహనాలను నడపాలని ఆయన సూచించారు. విజయనగర్ కాలనీలో ఈ రహదారిని కొద్ది నెలల క్రితమే నూతనంగా నిర్మించామని, అయితే రహదారిపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనదారులు అధిక స్పీడ్‌లో వెళుతు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. మున్సిపల్ చైర్మన్ స్వయంగా వచ్చి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించడంతో స్థానిక కాలనీవాసులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయిస్తున్న చైర్మన్ నరేందర్

ముగిసిన ఖోఖో పోటీల శిక్షణ శిబిరం

-రాష్ట్ర స్థాయిలో పాల్గొనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని సాధించాలి
-21 నుంచి 55వ సీనియర్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు షురూ..

తూంకుంటలో ముగిసిన ఖోఖో పోటీల శిక్షణ శిబిరం, రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమైన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు దృశ్యం

శామీర్‌పేట, అక్టోబరు 19, ప్రభాతవార్త
తూంకుంటలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల ఖో.ఖో టీమ్ జట్టు శిక్షణా శిబిరం ముగిసింది. బుధవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల ఖోఖో జట్టు శిక్షణ శిబిరం ముగిసింది. రాష్ట్ర స్థాయి పోటీలకు జట్టు ఎంపికైన వారిని అభినందించారు. ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్న 55 వ సీనియర్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల జట్టు శిక్షణ శిబిరం ముగిసింది. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీ జట్టును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జట్టు కోచ్ జైప్రకాశ్, మేనేజర్ సత్తిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శివరాం, శ్వేత, సీనియర్ క్రీడాకారులు సంజీవగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగ సీనియర్ క్రీడాకారుడు సంజీవగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐదు వేల రూపాయలు వారికి ఆర్థిక సహాయం అందజేశారు. జట్టుకు తూంకుంట మున్సిపాల్టీ 1వ వార్డు కౌన్సిలర్ పూజభరత్‌సింగ్ క్రీడాకారులకు కిట్లను అందజేశారు. పది రోజుల శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు కాసుల ఈశ్వర్‌గౌడ్ భోజన వసతిని కల్పించారు.

నడి రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

-భయంతో గజగజలాడుతున్న బస్తీ వాసులు
-వివేకానంద కాలనీలో ఆందోళన చెందుతున్న కాలనీవాసులు
-పట్టించుకోని మున్సిపల్ అధికారులు

శంషాబాద్ అక్టోబర్19, ప్రభాతవార్త :
శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని వివేకానంద నగర్‌లో కొందరు వ్యక్తులు నడిరోడ్డుపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నదంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివేకానంద కాలనీ, వెలంకిని కాలనీలో కొందరు వ్యక్తులు బహుళ అంతస్తుల భవనాలను నిర్మిచంఇ ఆ భవనాలకు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం సొంతంగా ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. తమ సొంత అవసరాల కోసం ఏర్పాటు చేసుకుంటున్న విద్యుత్ ట్రాన్స్ పార్మార్లను తమ సొంత స్థలాలల్లో ఏర్పాటు చేసుకోకుండా వీధుల్లో రోడ్లపై ఏర్పాటు చేయడంతో భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్ పార్మర్ల వద్ద చిన్న పిల్లలు ఆడుకోవడం పశువులు సంచారం చేయడం ద్వారా ప్రమాదాలు ఏర్పాడే ప్రమాదం ఉందని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని రోడ్ల పక్కన కాకుండా ఎవరు ఏర్పాటు చేసుకుంటున్నారో వారొ సొంత స్థలంలో వాటిని బిగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీవాసులకు ఇబ్బందులు రాకుండా చూడాలని ట్రాన్స్ పార్మర్ల ఏర్పాటును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇళ్ల మధ్యన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

అభ్యాసకేంద్రీకరణ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఏయూలో బిబిఏ ఓరియెంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపకులపతి రామచంద్రం

ఘట్‌కేసర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త:
విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా నైపుణ్యతను పెంపొందించుకోవాలని అనురాగ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.రామచంద్రం అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో బుధవారం స్కూల్ ఆఫ్ మెనేజ్‌మెంట్‌లో బిబిఏ విద్యార్థుల రెండోబ్యాచ్‌కు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కొత్త బ్యాచ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు పలువురు హాజరయ్యారు. ఏయూ వీసీ రామచంద్రం విచ్చేసి మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ రంగంలో వస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ ఉట్ల బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రవర్తన, ఎంపికలు, నిర్ణయాలపై యాజమాన్యం భాధ్యత వహించాలని సూచించారు. బిబిఏ ప్రోగ్రామ్ డైరక్టర్ పిఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ భవిష్యత్తు కెరీర్‌లకు గేట్‌వేగా ఉంటుందని సీఏ, సీఎస్ వంటి ప్రత్యేక ప్రోగ్రామ్‌లపై ఆయన వివరించారు. బిబిఏ మొదటి బ్యాచ్‌లోని విద్యార్థులు క్యాంపస్‌లో నిర్వహిస్తున్న మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లో పాల్గొనడం ద్వారా వారి ప్రాక్టికల్ లెర్నింగ్‌లపై ప్రదర్శను అందించారు. ఈకార్యక్రమంలో ఏయూ ఎగ్జామినేషన్స్ డీన్ ప్రొఫెసర్ ముత్తారెడ్డి, ఎంబిఏ విభాగాధిపతి డాక్టర్ విష్ణువందన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొందుర్గు, అక్టోబర్ 19, (ప్రభాతవార్త) :
కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు త్రాగి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన బుధవారం మండల పరిధిలోని టేకులపల్లి గ్రామం లో జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం టేకులపల్లి గ్రామానికి చెందిన మాల అంజయ్య(35) బుధవారం ఇంట్లోనే పురుగుల మందు త్రాగగా గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కెసిఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ : ఎంపిపి

మర్కుక్, అక్టోబర్ 19 (ప్రభాతవార్త): సిఎం కెసిఆర్ ప్రభుత్వం పాలన లో అన్ని గ్రామాలకు మహర్దశ వచ్చిందని ఎంపిపి పాండుగౌడ్ తెలిపారు. పాములపర్తి గ్రామంలో జెడ్‌పిటిసి నిధులు రూ.4 లక్షల వ్యయంతో బుధ వారం సిసి రోడ్డు నిర్మాణ పనులను ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందన్నారు. జిల్లాలోనే మర్కుక్ మండలం కోట్ల రూపాయల అభివృద్ధితో ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గణేష్, ప్రభాకర్, నాయకులు నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చెక్కల రాములు, జుట్టు సుధాకర్, ఎస్ఎంపి చైర్మన్ మల్లేశం, మేర వెంక టేశం, ఏడెల్లి మల్లేశం, శ్రీనివాస్, తలకొక్కుల ప్రభాకర్, ఉప్పరి యాద గిరి, శ్రీకాంత్, సంపత్‌రెడ్డి, బాలస్వామి, మల్లేశం పాల్గొన్నారు.

వినియోగదారులకు ప్రయోజనాలు, సదుపాయాలను కల్పిస్తుంది
నాగారం అక్టోబర్19, ప్రభాతవార్త : శ్రీలంక పరిస్థితి మెరుగుపడుతున్న క్రమంలోనే మాస్టర్ కార్డు నేడు భారతియ పర్యాటకులకు ఈ ద్వీప దేశం అందించే స్మరణీయ అనుభవాలను ఆవిష్కరించే శ్రీలంక విత్ లవ్ అనే క్యాంపెయిన్‌ను నేడు ప్రారంభించింది. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా మాస్టర్ కార్డ్ 50కు పైగా హోటళ్లు, రిసార్టులు, రెస్టారెంట్లు, టూర్ ఆపరేటర్లతో భాగస్వామ్యాన్ని కలిగి ఉండగా, పర్యాటకులకు శ్రీలంక ప్రాధాన్యతల గమ్య స్థానంగా ఉత్తేజించనుంది. శ్రీలంకకు భేటి కావాలని కోరుకునే మాస్టర్‌కార్డు కలిగిన వారు మాస్టర్ కార్డు ప్రిన్సిలెస్ స్పెషల్స్ వెబ్‌సైట్‌లో అన్ని ప్రయోజనాలు, సదుపాయాలను వీక్షించి తెలుసుకోవచ్చు అని వెల్లడించింది.

మహాసభలకు తరలిన గౌడసంఘం నాయకులు

హుస్నాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త :
బుధవారం యాదగిరిగుట్ట లో నిర్వహించిన కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు హుస్నా బాద్ మండలం నుంచి సంఘం మండల అధ్యక్షుడు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున తరలివెళ్లారు. మహాసభలకు తరలిన వారిలో నాయకులు పూదరి రవీందర్‌గౌడ్, లక్ష్మన్‌గౌడ్, అంజయ్యగౌడ్, పూదరి రాజు, మల్లయ్య, కొమురయ్య, పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ ఉన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

తొగుట, అక్టోబర్ 19, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఘనపూర్ గ్రామంలో తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ సరిత, శ్రీదేవి, వ్యవసాయాధికారి మోహన్ పత్తి, వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వారు పలు సూచనలు చేశారు. అధిక వర్షాల నేపథ్యంలో రైతులు చేనులో నిలిచిన నీటిని బయ టకు వెళ్లే విధంగా చేయాలన్నారు. పత్తి పంటలో కాయ కుళ్లు తెగలు కని పించినచో కాపర్ అక్సీక్లోరైడ్ మందు లీటర్ నీటికి 3 గ్రాములు కలిపి మొక్కలు బాగా తడిసె విధంగా స్ప్రే చేయాలన్నారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు కనిపించినచో ఇమమేకటిన్ బొంజోయెట్ అనే మందు 80 గ్రా॥ ఎకరాకు స్ప్రే చేయాలన్నారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరస్తరానిప్రోల్ 60 గ్రాములు ఎకరాకు, అకుముడత పురుగు నివారణకు క్లోరోపిరిఫోస్ 2.5 మీ. లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. క్షేత్ర సందర్శనలో రైతులు గొట్టం యాదగిరి, అశోక్‌రెడ్డి, కనకరాజు, విస్తరణ అధికారి దేవేందర్ పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

-రూ.7.52 లక్షల ఆదాయం

జగదేవ్‌పూర్, అక్టోబర్ 19 (ప్రభాతవార్త): మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో వెలసిన శ్రీకొండపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపును బుధవారం ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మోహన్‌రెడ్డి మాట్లా డుతూ భక్తులు అమ్మవారికి 3 నెలల 24 రోజుల కాలంలో సమర్పించిన హుండీని లెక్కించడం జరిగిందని, ఇందులో రూ.7 లక్షల 52వేల 505 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రజితరమేష్, ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ సూపరింటెండెంట్ శివరాజ్, సిబ్బంది మల్లికార్జున్‌రెడ్డి, శ్యామ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ఆలయ డైరెక్టర్లు ఆర్‌కె. శ్రీనివాస్, దాచారం కనకయ్య, రాంచంద్రారెడ్డి, భూపతిరెడ్డి, ముక్కెర గీత, నాగరాజు, అర్చకులు కొండయ్య, లక్ష్మణ్, గోవర్ధన్, తిరుపతి, అయిలయ్య, కృష్ణమూర్తి, ఆలయ సిబ్బంది శ్రీను, చందు, అంజయ్య, సుధాకర్, సంజీవులు, పోలీస్ సిబ్బంది ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధనత్రయోదశి పండుగను సంబరంగా జరుపుకోండి
నాగారం అక్టోబర్19, ప్రభాతవార్త : సంపద, సుసంపన్నతల పండగ ధనత్రయోదశి ఈ ఏడాది అక్టోబర్23న సంబరం చేసుకోబడుతుంది. అమెజాన్ ఫ్యాషన్ ఈ ధనత్రయోదశిని గుర్తుండిపోయేలా చేయడానికి మీ కోసం వాస్తవమైన జ్యువెలరీ వస్తువుల శ్రేణిని విలక్షణమైన ఇయర్ రింగ్స్, డైమాండ్, ఇంకా ఎన్నో వాటి రూపంలో అందిస్తోంది పలు జ్యూవెలర్స్ షాప్ నుండి విశ్వశనీయమైన బ్రాండ్స్ నుండి ఎంచుకోండి ఆఫర్స్‌ను పొందవచ్చాని వెల్లడించింది.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 19, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరగడంతోపాటు అభివృద్ధి సాధ్యమవుతుం దని డీసీసీ ఓబీసీ సెల్ అధ్యక్షులు డాక్టర్ లక్కరసు సూర్య చంద్రవర్మ అన్నారు. నల్గొండ జిల్లా మునుగోడు ఉప ఎన్నికల్లో భాగంగా బుధవారం సిద్దిపేట నుంచి పార్టీ శ్రేణులతో తరలివెళ్లి పెద్దకొండూరులో ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. మునుగోడు ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్వయి స్రవంతిని గెలిపించడానికి అన్ని వర్గాల ప్రజలు ఉత్సహంతో ఎదిరి చూస్తున్నారని తెలిపారు. మునుగోడు ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతూ ఇవ్వడానికి ప్రతి ఒక్క రూ ముందుకు వస్తున్నారని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నిక గెలుపే రేపు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నాంది పలుకుతుందన్నారు. టిఆర్ఎస్, బిజెపి డబ్బు సంచులకు మునుగోడు ప్రజలు అమ్ముడుపోరని తెలిపారు. ఆయన వెంట పార్టీ శ్రేణులు ఉన్నారు.

అత్యుత్తమ హిప్ హాప్ సంగీత ప్రతిభకు వేదిక కానున్న నగరం
శామీర్‌పేట అక్టోబర్19, ప్రభాతవార్త : అతిపెద్ద హిప్ హాప్ ఫెస్టివల్, వరుసగా ఆరవ సిరిస్ అయిన బ్రీజర్ వివిడ్ షఫల్ ప్రారంభాన్ని నాడ్ మిన్ గేమింగ్, బ్రీజర్ ప్రకటించాయి. నవంబర్ 5న హై-ఎనర్జీ బ్లాక్ పార్టీతో బిట్స్ ఆఫ్ ద స్ట్రీట్స్ హైదరాబాద్‌ను ఊర్రుతలుగించనుంది. యూత్ ఐకాన్ బివిఎస్‌తో దీర్ఘకాలిక అనుబంధం కలిగిన విజయ్ దేవరకొండ కూడా ఈ కార్యక్రమానికి హాజరై ప్రేక్షకులకు జోష్ పెంచనున్నారు. భారతదేశ హిప్ హాప్ మూవ్‌మెంట్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తున్న ఈ బ్లాక్ పార్టీ దేశంలోని అత్యంత సంచలనాత్మక హిప్ హాప్ గాయకుల్లో కొందరి ఉద్వేగభరిత ప్రదర్శనలను చూడనుంది. ఈ ఫెస్ట్ నెమ్మదిగా హిప్ హాప్‌ను ఒక కల్ట్‌గా వేడుక చేసుకునే సంస్కృతి ప్రతిభ, గొంతుల కలయికగా మారుతుంది. ఏటా సంగీత పరిణామానికి కొత్త జోడింపు అవుతుంది అని పలువురు ప్రతినిధులు అన్నారు.

మునుగోడు ప్రచారానికి తరలివెళ్లిన ప్రజాప్రతినిధులు, నాయకులు

శామీర్‌పేట, అక్టోబరు 19, ప్రభాతవార్త
మునుగోడు ఉప ఎన్నికల కోసం ప్రచారంలో పాల్గొనటానికి శామీర్‌పేట ఉమ్మడి మండలం నుంచి పలు గ్రామాల నుంచి టిఆర్ఎస్ (బిఆర్ఎస్) పార్టీకి చెందిన మండలాల ప్రజాప్రతినిధులు, మండలాల నాయకులు, గులాబి శ్రేణులు తరలి వెళ్లారు. బుధవారం రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి సూచనల మేరకు శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలకు చెందిన గులాబి పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మునుగోడుకు వెళ్లి ప్రచారంలో పాల్గొన్నారు. టిఆర్ఎస్ అభ్యర్థి కె.ప్రభాకర్‌రెడ్డి గెలుపుకోసం శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, మండల జడ్పీటిసి ఎం.అనితలాలయ్య, మూడుచింతలపల్లి మండల ఎంపిపి వి.హారికమురళీగౌడ్, రెండు మండలాల పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, మండలాల టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు సైబర్ మోసగాళ్ళతో జాగ్రత్తగా ఉండాలి

కొడంగల్, అక్టోబర్19, ప్రభాతవార్త :
కొడంగల్ మండల ప్రజలు సైబర్ మోసగాళ్ళతో జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ రవిగౌడ్ అన్నారు. త్వరలో 5జీ సేవాలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో సైబర్ మోసగాళ్ళపట్ల వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని అయన సూచించారు. సైబర్ మోసగాళ్ళు అమాయకుల ఖాతాలు కొల్లగొట్టేందుకు ఏ దారిని వదలడం లేదన్నారు. 4జీ నుండి 5జీ మారండి అంటూ ఫోన్ చేయడం లేదా మేసేజ్ పంపి ఓటీపి చెప్పమని అడిగితే తొందరపడి క్లిక్ చేయవద్దని అన్నారు. ఇదే అదునుగా మీ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

త్వమ్ యజామహే శతాబ్ది ఉత్సవాలు

త్వమ్ యజామహే స్వాధ్యాయ వేడుకల దృశ్యం

కొత్తూర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త :
త్వమ్ యజామహే స్వాధ్యాయ పరివార్ ఆధ్వర్యంలో చేవెళ్లలో పరమ పూజ్య శ

స్వచ్ఛ నందిగామ కోసం కృషి

-రోడ్డు మరమ్మతు పనులు చేపట్టిన సర్పంచ్

నందిగామలో రహదారిపై గుంతలను పూడ్చి చదును చేసిన సర్పంచ్,తదితరులు

నందిగామ అక్టోబర్19,ప్రభాతవార్త : స్వచ్ఛ భారత్,స్వచ్ఛ నందిగామ కోసం కృషి చెద్దామని ఈ మహాత్తర యజ్ఞానికి ప్రజలందరూ సహకరించాలని నందిగామ సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిని,గుంతలమయమైన నందిగామ రహదారిపై మరమ్మతు పనులు చేపట్టారు.మండల కేంద్రం నుండి మేకగూడ బైపాసుకు వేళ్లే రహదారి గుంతలను బుధవారం ఉదయం పనులకు శ్రీకారం చుట్టారు.గుంతలను పూడ్చి జేసిబి సహాయంతో చదును చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎర్రగారి రమేష్,శివ్వగల్ల జంగయ్య,కోర్న గోపాల్,నరేష్,శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

మృతిరాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి అక్టోబర్19, ప్రభాతవార్త :

తలకొండపల్లి మండలానికి చెందిన నర్సమ్మ అనారోగ్యంతో మరణించడంతో ఈ విషయాన్ని సర్పంచ్ లలిత జ్యోతయ్య ద్వారా తెలుసుకున్న జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 3వేల రూపాయలను ఆర్థిక సాయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత జ్యోతయ్య,సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్ యాదవ్,వార్డు మెంబర్స్ స్వరూప,నూకం కోటేశ్వర్,డాక్టర్ రమేష్,వెంకటయ్య, శ్రీను, పాండు,తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఐక్యత ఫౌండేషన్ చేయూత

తలకొండపల్లి అక్టోబర్19, ప్రభాతవార్త :

తలకొండపల్లి మండల పరిధిలోని పూల్‌సింగ్ తండాకి చెందిన వాలీబాల్ జాతీయ క్రీడాకారిణి సుజాత వాలిబాల్ ఆడుతుండగా తీవ్రంగా గాయపడింది.దింతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. బుధవారం ఆస్పత్రికి వెళ్లి సుజాను ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి 10వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫుల్‌సింగ్ తండా సర్పంచ్ లలితా రాజు నాయక్,వీరన్నపల్లి సర్పంచ్ నాగమణి లింగం గౌడ్,మాదాయపల్లి సర్పంచ్ హైమావతి రామస్వామి,గౌరిపల్లి సర్పంచ్ అనురాధ నరేందర్ గౌడ్,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్,ఆర్.లక్ష్మణ్ నాయక్,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ

-పాల్గొన్న ఎంపిటిసి సంగీత సిద్ధేశ్వర

గ్రంథాయల భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపిటిసి,సర్పంచ్,తదితరులు

శంషాబాద్ అక్టోబర్19,ప్రభాతవార్త :

గ్రామంలోని ప్రతి ఒక్కరికి ఉపయోగపడే విధంగా నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించనున్నట్లు కవ్వగూడ ,సుల్తాన్‌పల్లి గ్రామాల ఎంపిటిసి సంగీత సిద్ధేశ్వర ముదిరాజ్ పేర్కొన్నారు.కవ్వగూడ గ్రామంలో సర్పంచ్ దేవరకొండ రమేష్ యాదవ్‌తో కలిసి బుధవారం భూమి పూజ చేశారు.మనిషికి ఎంత ఆస్తి ఉన్నాయని సిరి సంపదలు ఉన్నా ఏదో ఒక రోజు అవి మన నుండి దూరం కావచ్చు కానీ విద్యార్థి అనేది మనం జీవించినంత కాలం మనతో ఉంటుందని ఆమె పేర్కొన్నారు. అందరికి విద్యను అందించాలని సంకల్పంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు వివరించారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారి మహోన్నతమైన భావాలు గల వ్యక్తులతో ముందు వరుసలో ఉంటానని ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ రమేష్ యాదవ్,మాజీ సర్పంచ్ మెట్టు రాజేందర్ ,ఉప సర్పంచ్ పద్మావతి సుదర్శన్,పంచాయతీ సభ్యులు దేవరకొండ ప్రవీణ్ యాదవ్, వెంకటేష్,రమేష్,సురేష్,చందు,దేవేందర్,నరేష్,లలిత,అరుణ గ్రామ ప్రముఖులు పెంటయ్య,నరసింహ,జంగయ్య,మురళి,రఘు,సిద్ధులు, యాదయ్య,దర్శన్,దయానంద్,నరేందర్ ,గణేష్,బాలు,రాకేష్, సాయి కుమార్,మహేష్,శ్రీకాంత్,అనురాగ్,ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ డిప్యూటీ తహసీల్దార్ నరేష్ బదిలీ

నరేష్‌ను సన్మానిస్తున్న అధికారులు,సిబ్బంది

శంషాబాద్ అక్టోబర్19,ప్రభాతవార్త : శంషాబాద్ డిప్యూటి తహసీల్దార్ నరేష్ బదిలీ అయ్యారు.గత కొంతకాలంగా శంషాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నరేష్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.బుధవారం బదిలీపై వెళ్తున్న ఆయనను శంషాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ,కార్యాలయ అధికారులు,సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆయనకు విడ్కోలు పలికిన వారిలో సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ,రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ సంజీవ,సునీత,జూనియర్,అసిస్టెంట్ అజయ్,కార్యాలయ సిబ్బంది,వీఆర్ఎలు,తదితరులు ఉన్నారు.

పిడుగుపాటుకు గురై మేక మృతి...సృహ తప్పిన వ్యక్తి

తలకొండపల్లి అక్టోబర్19,ప్రభాతవార్త : తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగు పడి మేక చనిపోయింది.గ్రామస్తుల వివరాల ప్రకారం రాంపూర్ గ్రామ సమీపంలోని దెల బావి దగ్గర ఉన్న మేక దగ్గర పిడుగు పడటంతో మేక అక్కడికక్కడే చనిపోయింది.అక్కడే ఉన్న మీసాల మల్లయ్య సృహ తప్పిపోయారు.బుధవారం సాయంత్రం భారీ వర్షం రావడంతో రాంపూర్ శివారులోని సూర్యారావు చెరువు నిండి అలుగుపారడంతో చుట్టు పక్కల గ్రామాలు రాంపూర్,మెదక్‌పల్లి,జంగారెడ్డి పల్లి,వెంకటరావుపేట, కర్కస్ తండా గ్రామాల ప్రజలు చెరువు వద్దకు భారీగా తరలివచ్చారు.

పిడుగు పాటుకు మృతి చెందిన మేకపిల్ల

మాకు గౌరవ వేతనంతో పాటు ప్రొటోకాల్ కల్పించాలి

-మంత్రికి విన్నవించిన మేకగూడ పిఎసిఎస్ చైర్మన్ మంజులారెడ్డి

నందిగామ అక్టోబర్19,ప్రభాతవార్త :

అన్నదాతల సంక్షేమాభివృద్ధికి గ్రామీణ ప్రాంతాలలో అనునిత్యం సేవలందిస్తున్న సింగిల్ విండో చైర్మన్లకు గౌరవ వేతనంతో పాటు ప్రోటోకాల్ కల్పించాలని నందిగామ మండలం మేకగూడ సింగిల్ విండో చైర్మన్,పిఎసిఎస్ చైర్మన్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ కంకంటి మంజులారెడ్డి ఐటి మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్‌కు విన్నవించినట్లు పేర్కొన్నారు.హైదరాబాద్ ప్రగతి భవన్‌లో రాష్ట్ర సింగిల్ విండో చైర్మన్ల ఫోరం మరియు మహబూబ్‌నగర్ జిల్లా సింగిల్ విండో చైర్మన్ల ఫోరం సభ్యులతో కలిసి మంత్రికి వినతిపత్రం సమర్పించినట్లు ఆమె తెలిపారు.చైర్మన్ల వినతిపై మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి గౌరవవేతనం,ప్రోటోకాల్ అంశాలను తీసికెళ్తానని చెప్పినట్లు చెప్పారు.మునుగోడు ఎన్నికల అనంతరం మళ్లీ ఒక పర్యాయం కలిసి అన్ని అంశాలను చర్చిద్దామన్నారు.తమవంతు బాధ్యతగా తెలంగాణ రాష్ట్రంలోని సింగిల్ విండో చైర్మన్లు పది రోజుల పాటు మునుగోడు ఎన్నికల్లో పాల్గొన్ని రైతులకు రైతుబంధు,రైతు బీమా వంటి పథకాలను,సంక్షేమాభివృద్ధి వంటి అన్ని విషయాలను తెలియజేసి టిఆర్ఎస్ గెలవడంలో మునుగోడు రైతులు కీలక పాత్ర పోషించే విధంగా చూడాలని మంత్రి సూచించినట్లు చైర్మన్ మంజులారెడ్డి తెలిపారు.సింగిల్ విండో చైర్మన్ల వేతనంతో పాటు ప్రోటోకాల్ తదితర సమ స్యలను తీర్చుతామన్నందుకు మంత్రి కెటిఆర్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి కెటిఆర్‌ను కలిసిన మేకగూడ సింగిల్ విండో చైర్మన్ మంజూలారెడ్డి

మునుగోడులో టిఆర్ఎస్ వైపే జనం మొగ్గు

మునుగోడు ప్రచారంలో పాల్గొన్న ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి శివంకర్ గౌడ్,

మునుగోడు ప్రచారానికి తరలిన నాయకులు

మునుగోడు ప్రచారంలో నందిగామ నాయకులు

నందిగామ అక్టోబర్19,ప్రభాతవార్త : టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుళ్ల ప్రభాకర్ రెడ్డి మునుగోడు ఉప ఎన్నికల్లో వంద శాతం విజయం సాధిస్తారని ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి ఎం.శివశంకర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన మునుగోడులో ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే తనయుడు కేశంపేట ఎంపిపి వై.రవిందర్ యాదవ్ ,టిఆర్ఎస్ నాయకులతో కలిసి టిఆర్ఎస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ..రైతులకు 24 గంటల విద్యుత్ ,రైతు బంధు,దళిత బంధు,ఆసరా పింఛన్లు వంటివి ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. కెసిఆర్ తన చాకచక్య పరిపాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.దేశంలోని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడం కోసమే బిఆర్ఎస్‌ను స్థాపించడం చారిత్రత్మాకమన్నారు.బిఆర్ఎస్‌ను దేశ ప్రజలు ఆదరిస్తే దేశానికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు.

మునుగోడు ప్రచారానికి తరలిన మొయినాబాద్ నాయకులు

మొయినాబాద్, అక్టోబర్ 19,ప్రభాతవార్త : రాష్ట్రంలో ఉప ఎన్నికలు జరుగుతున్న మునుగోడు రసవత్తరంగా మారింది. బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మునుగోడులో జరిగేటువంటి ఉప ఎన్నికల్లో తనవంతుగా మునుగోడు ప్రజలను చైతన్యం చేసి ప్రచారం చేయడానికి మొయినాబాద్ మండల టీఆర్ఎస్ నాయకులతో కలిసి బయలుదేరారు. బుధవారం ఆయన మునుగోడు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డితో కలిసి నాంపల్లి మండలం ప్రసునూరు తాండాలో ప్రచారం చేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ మునుగోడులో టీఆర్ఎస్ అభ్యర్థి గెలుస్తాడని దీమా వ్యక్తం చేశారు, తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసిఆర్ తీసుకోచ్చిన అద్భుతమైన తథకాలే టీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయన్నారు, ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోంపల్లి అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, వైస్ ప్రసిడెంట్ గునుగూర్తి జేవంత్, రెడ్డిపల్లి ఎంపీటీసి బట్టు మల్లేషం, ఉప్పసర్పంచ్ రహూఫ్, నర్సింహ గౌడ్, తోల్కట్ట రవి, టీఆర్ఎస్ యువనాయకులు పూసల పరమేష్, మోత్కూపల్లి సునీల్, మొయినాబాద్ మండల టీఆర్ఎస్ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తధితరులు పాల్గొన్నారు,

పాఠశాల అభివృద్ధికి ఎన్ఆర్ఐ ఉదారత

-రూ.20లక్షలు వెచ్చించనున్నట్లు సర్పంచ్ వెల్లడి

జిల్లెడు ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎన్ఆర్ఐ శ్రీనివాస్

జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 19,(ప్రభాతవార్త): సొంతూరులోని పాఠశాలను దత్తత తీసుకోవడానికి గ్రామానికి చెందిన పొట్టి శ్రీనివాస్ ముందుకు వచ్చినట్లు సర్పంచ్ బాబురావు తెలిపారు. బుదవారం ఆయన పాఠశాల అభివృద్ధికి కావాల్సిన మౌళిక వసతులు గుర్తించినట్లు తెలిపారు. పాఠశాలలో కార్యాలయం గది, రెండు అదనపు గదులు, వంట గది, మరుగుదొడ్లు, నీటి వసతితో పాటు ప్రహరి గోడ నిర్మించడానికి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అదే విదంగ విద్యార్థులకు నాణ్యమైన బోజనం, నోటు పుస్తకాలు, బ్యాగులు, బెంచీలు, ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దాదాపుగా దత్తత తీసుకున్న పాఠశాల అభివృద్ధి కోసం రూ. 20లక్షల వరకు వెచ్చించడానికి ఎన్ఆర్ఐ శ్రీనివాస్ తండ్రి పొట్టి సత్యయ్య జ్ఞాపకార్థం కృషి చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఎన్ఆర్ఐ ఉదారత పట్ల గ్రామస్తులు అధికారులు అబినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హజిపల్లి మాజి సర్పంచ్ సింగారం శ్రీనివాస్, గ్రామస్తులు ప్రకాశ్, యాదయ్య, ప్రవీన్, ఎల్లేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 19,(ప్రభాతవార్త): మండలంలోని చేగిరెడ్డి ఘనాపూర్ గ్రామంలో బుదవారం కురిసి వర్షానికి ఖమ్రుమియా ఇల్లు కూలింది. చిన్నపాటి ఇంట్లో జీవిస్తున్న ఇతని కుటుంబానికి వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని, ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజురు చేయాలని బాదితులు మీడియా తరపున కోరారు.

నాగర్‌గూడనే మండల కేంద్రం చేయాలి

నాగర్‌గూడను మండల కేంద్రం చేయాలని ఐక్యత చూపుతున్న ఆయా గ్రామాల నాయకులు, గ్రామస్థులు

షాబాద్, అక్టోబర్ 19, ప్రభాతవార్త :

పరిపాలన సౌలభ్యం కోసం ప్రస్తుతం ఉన్న షాబాద్ మండలాన్ని విభజించి నాగర్‌గూడ మండల కేంద్రంగా చేయాలని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌గూడలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో అఖిల పక్షం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రస్తుతం షాబాద్ మండల పరిధిలోని 41 గ్రామపంచాయతీలు ఉన్నాయని, దీంతో గ్రామాలాభివృద్ధి చాలా మేరకు కుంటుపడుతుందన్నారు. వనరులు కలిగిన నాగర్‌గూడను ఎంపిక చేసుకుని మండలంగా మార్చాలన్నారు. ఈకార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పామెన భార్గవరామ్, మాజీ కోఆప్షన్ మెంబర్ సయ్యద్ అయూబ్, సర్పంచులు శ్రీనివాస్ గౌడ్, రాములు, పెంటయ్య, మాజీ ఎంపీటీసీ మద్దూరి పాండు, ఆయా గ్రామాల నాయకులు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఈదుల నర్సింలుగౌడ్, జోగు వెంకటయ్య, మద్దూరి మల్లేష్, పామెన నర్సింలు తదితరులు ఉన్నారు.

టంగుటూర్ గ్రామం నుండి అయ్యప్ప సన్నిధికి మహా పాదయాత్ర

మహాపాదయాత్ర నిర్వహిస్తున్న స్వాములు

శంకర్‌పల్లి, అక్టోబర్ 19, ప్రభాతవార్త :

ఉమాశంకర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండలం టంగుటూర్ గ్రామం నుండి బుధవారం రోజున మహాపాదయాత్ర నిర్వహించారు. ఈకార్యక్రమంలో నరసింహ్మారెడ్డి గురుస్వామి,మల్లారెడ్డి గురుస్వామి,మహిపాల్‌రెడ్డి గురు స్వామి,నరేష్‌రెడ్డిగురుస్వామి, విక్రాంత్‌యాదవ్ గురుస్వామి, ఓం ప్రకాష్ గదా స్వామి, వినీత్‌రెడ్డి కన్నె స్వామి,అరవిందస్వామి శబరిమలైకి పాదయాత్రతో బయలుదేరారు.

విద్యార్థులకు బాల్యదశ నుండే సత్ప్రవర్తన, క్రమశిక్షణ అలవార్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

షాబాద్, అక్టోబర్ 19, ప్రభాతవార్త :

విద్యార్థులకు బాల్యదశ నుండే సత్ప్రవర్తన క్రమశిక్షణ అలవాటు చేయాలని పోతుగల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సత్యసాయి సేవా సమితి అభ్యర్థి గోపాలాచారిలు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పోతుగల్ ఉన్నత పాఠశాలలో సత్యసాయి సేవా సంస్థ చేవెళ్ల వారి ఆధ్వర్యంలో మానవ సేవయే మాధవసేవ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యార్థులు బాల్యదశ నుండే క్రమశిక్షణ, సత్ప్రవర్తన, నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. అదేవిధంగా బాగా కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తుకు బాట వేసుకోవాలని, ప్రతి మనిషి తోటి వారికి సాయం అందించాలన్నారు. పరులకు ఉపకారం చేయడమే పుణ్యకార్యమని, సత్ప్రవర్తనతో కూడిన జీవన విధానం ఉండాలన్నారు. ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలని, దేవుడు ఎక్కడో లేడు ప్రతి మానవుని పుణ్యకార్యక్రమాల ద్వారానే దేవుడు ఉన్నాడన్నారు. ఈకార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు పెంటారెడ్డి, శంకరయ్య, రెహబిలిటేషన్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విఠలయ్య, సుచంద్రశేఖర్, విఠలయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి

అంబేద్కర్ ప్రజాసంఘం సభ్యులతో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం

షాబాద్, అక్టోబర్ 19, ప్రభాతవార్త :

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం తెలిపారు. షాబాద్ మండలం సీతారాంపూర్‌లో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.... అంబేద్కర్ తన జీవితాన్ని, భార్య నలుగురు పిల్లల ప్రాణాలను త్యాగం చేసి దేశంలోని బడుగు, బలహీన వర్గాలకు అన్ని హక్కులను కల్పించారన్నారు. తద్వారానే నేడు అసమానతుల భారత సమాజంలో అణిచివేతకు గురవుతున్న పీడిత ప్రజానీకం అన్ని రంగాల్లో ప్రవేశించడంతోపాటు, రాణించడానికి అవకాశం లభించిందన్నారు. అంబేద్కర్ కోరుకున్న కుల నిర్మూలన, సమ సమాజం, సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో అన్ని వర్గాలకు సమాన హక్కులు లభించనప్పుడే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. తరాలుగా మన బతుకులను బానిసలుగా మార్చిన మనువాదం పైన పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ ప్రజాసంఘం రాష్ట్ర కార్యదర్శి బేగరి మహేశ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మైలారం సుబ్రహ్మణ్యం, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ జె.డి.రమేష్, చేవెళ్ల నియోజ కవర్గం అధ్యక్షులు దప్పు రాజేందర్, మహిళా నాయకురాలు జ్యోతి ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక....

ఈసందర్భంగా అంబేద్కర్ ప్రజాసంఘం సీతారాంపూర్ గ్రామ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా రాజేందర్, ఉపాధ్యక్షులుగా ఎం.బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శిగా డి.సుదర్శన్, సహాయ కార్యదర్శిగా ఇ.నర్సింలు, కోశాధికారిగా సి.హెచ్ శ్రీనివాస్‌లతో పాటు మరో 15మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజల సంక్షేమానికి కృషి చేస్తాం

శంకర్‌పల్లి, అక్టోబర్ 19, ప్రభాతవార్త : ఎన్నో ఏండ్ల కష్టాలు తీర్చిన మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మిప్రవీణ్‌కుమార్. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని అయ్యప్పరెడ్డిగూడ ప్రజలకు రేషన్ తీసుకోవడానికి రెండు కిలోమీటర్లు నడిచి తీసుకోవాల్సి వచ్చేది, వారి కష్టాలు తెలుసుకున్న చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మిప్రవీణ్‌కుమార్ అయ్యప్పరెడ్డిగూడలోనే వారు రేషన్ తీసుకునేలా అక్కడే రేషన్ షాప్ ఏర్పాటు చేయడంతో ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

అప్పుల బాధతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొందుర్గు, అక్టోబర్ 19, (ప్రభాతవార్త) : అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తంగళ్లపల్లిలో జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన కూర సత్తయ్య (42) అనే రైతు అనే రైతు అప్పుల భాదతో తన స్వంత వ్యవసాయ పొలంలోనే ఉరేసుకొని మృతి చెందినట్లు మృతుని భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చెన్న కేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న గోవర్ధన్ యాదవ్

జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 19,(ప్రభాతవార్త):

ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్న కేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పీఆర్‌టీయు టీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అన్నారు.బుదవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఇంద్రానగర్, పెద్ద ఎల్కిచర్ల, ఎదిర గ్రామాల్లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్‌లు, పండిట్, పీఈటి, పోస్టుల అప్‌గ్రెష్ చేయిస్తామని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు పీఆర్‌టీయు టీఎస్ ద్వార అనేక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించినట్లు ఆయన పెర్కొన్నారు. రాబోయే ఉపాధ్యాయుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు అందరు చెన్న కేశవరెడ్డి గెలుపుకు కృషి చేయాలని పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు టీఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి జగన్, శ్రీనివాసులు, రాఘవేందర్, హన్మంతు, నరేందర్‌రెడ్డి, సుధీర్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దామోదర్‌రెడ్డి సేవలు ప్రశంసనీయం

-లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి

దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తలకొండపల్లి అక్టోబర్19,ప్రభాతవార్త :

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ వారి ఆధ్వర్యంలో లయన్స్ డాక్టర్ వి.దామోదర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.కల్వకుర్తి పట్టణంలోని ప్రశాంత్ నర్సింగ్ హోం స్థాపించి 50వసంతాలు పూర్తి అయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లి వేడుకలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ విజయవంతమైనందుకు లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి డాక్టర్ వి.దామోదర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.లయన్స్ క్లబ్ డాక్టర్ వి.దామోదర్ రెడ్డి సేవలను కొనియాడారు.నిరుపేద ప్రజలకు సేవలందిస్తున్న దామోదర్ రెడ్డిని క్లబ్ అధ్యక్షుడు బైరి కర్ణకర్ రెడ్డి,కార్యదర్శి కుడుముల భాస్కర్ రెడ్డి,కోశాధికారి కొండల్ రెడ్డి జోన్ చైర్మన్ కె.రాంరెడ్డి,క్లబ్ పిఆర్ఓ పాషాలు సన్మానించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వెంకట్ రెడ్డి నరేందర్ రెడ్డి,సంపత్ కుమార్ ,శ్రీనివాస్, గరవ్నర్లు రిజియన్ చైర్మన్,జిల్లా చైర్మన్లు,క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప నాయకుడు సిఎం కెసిఆర్ : చంద్రారెడ్డి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రారెడ్డి

శంషాబాద్ అక్టోబర్19,ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవ సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారిన శంషాబాద్ మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి పేర్కొన్నారు.ఆగస్టు నెలలో జరిగిన రంగారెడ్డి జిల్లా నూతన భవన కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా రంగారెడ్డి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు 10కోట్ల రూపాయల చొప్పున అభివృద్ధికి కేటాయిస్తానని ఇచ్చిన హామి మేరకు నిధులు కేటాయించారని తెలిపారు.ఇచ్చిన మాట మేరకు మాట తప్పకుండా రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి పది కోట్ల రూపాయలు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి కెసిఆర్ చేవెళ్ల ఎంపి రంజిత్ రెడ్డి,రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కృషి వల్లనే నిధులు వచ్చాయని నియోజకవ

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

-ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

పెద్దేముల్, అక్టోబరు 19, ప్రభాతవార్త:

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. బుదవారం తాండూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన సజ్జాద్‌కు రూ.1 లక్షా 50వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును రోహిత్‌రెడ్డి అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతో బాసటగా నిలిచి వారి కుటుంబానికి భరోసా కల్పిస్తుందని అన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సిఎం కేసిఆర్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రుక్మాపూర్ మాజీ సర్పంచ్ రమేష్, మంబాపూర్ సర్పంచ్ ఆర్,శ్రావన్ యువనాయకుడు సయ్యద్ ఇబ్రాహీం పాల్గొన్నారు.

రోడ్లపై పంటల నూర్పిడి చేయరాదు : ఎస్ఐ నయుమోద్దీన్

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ.

బొంరాస్‌పేట్,అక్టోబర్19,ప్రభాతవార్త ః

బొంరాస్‌పేట్ మండల పరిధిలోని తుంకిమెట్ల జాతీయ రహదారిపైన రైతులు పండించిన తమ పంటలను నూర్పిడి చేసేందుకు బీటీ రోడ్లను ఉపయోగించరాదని రైతులకు అవగాహన కల్పించిన ఎస్ఐ నయుమోద్దీన్.రైతులు పండించిన పంటలను రోడ్లపై నూర్పిడి చేస్తున్నరని అలా చేయడం వలన,అడ్డుగా రోడ్డుపై పెట్టిన బండరాళ్ళ వలన ప్రమాదాలు జరిగే ఆవకాశం ఉందన్నారు. రోడ్డుపై వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు.రైతులు రాత్రి సమయంలో పంటలపై నల్లటి తాడిపత్రి కప్పడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.అలాగే రైతులు రాత్రి సమయంలో ధాన్యానికి కాపలగా రైతులు రోడ్డుపై పడుకోరాదని అన్నారు.రోడ్డుపై పంట నూర్పిడి చేయడం,ధాన్యం అరబెట్టడం ద్వార వాహనాలకు ఇబ్బంది కల్గిస్తే క్రమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపరాదు

మర్పల్లి అక్టోబర్ 19 ప్రభాతవార్త : బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం మరియు మద్యం సేవించి వహనాలను నడుపడం ప్రమాదకరమని మర్పల్లిఎస్ఐ రాజెంద్రప్రసాద్ అన్నారు మద్యం సేవించి వాహనం నడుపుతున్న మెంగప మెరంగపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌ను వికారాబాద్ కోర్టు యందు హాజరు పరుచగా వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష 2000 వేల రుపాయల పైన్ వేయడం జరిగిందని ఆయన తెలిపారు.

వాయిదా పడ్డ సర్వసభ్య సమావేశం

మర్పల్లి అక్టోబర్ 19 ప్రభాతవార్త : మర్పల్లి మండల సర్వససభ్య సమావేశం బుధవారం నాడు ఎంపీపీ బట్టు లలితా అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు సమావేశానికి సరైన సఖ్యలో సభ్యులు హాజరు కాకపోవడంతో ఎంపీపీ సమావేశాన్ని వాయిదా వేశారు.అధికారులు కూడా సమావేశానికి సకాలంలో సరైన సమాచారం తో రావడంలేదని ఆమె అన్నారు.సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఉన్నత అధికారులు, సభ్యలు సకాలంలో హాజరు కావలని గ్రామాల నుండి సమస్యలు పరిష్కారమవుతాయని ఆమె అన్నారు.ఈ సమావేశంలో మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిటి రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు

-వాహనదారులకు ఇబ్బందులు

-పట్టించుకోని అధికారులు

బీటీరోడ్డుపై ఏర్పాడిన భారీగుంత

బొంరాస్‌పేట్,అక్టోబర్19,ప్రభాతవార్త ః

నెల రోజుల క్రితం చిన్న గంతగా ఉన్న నాందార్‌పూర్ నుండి ఏర్పుమళ్ళ గ్రామానికి వెళ్ళే బీటీ రోడ్డు భారీ వర్షాలకు పెద్దగుంతగా మారింది.నెలరోజుల నుండి విరామం లేకుండా కురుస్తున్న వర్షానికి కల్వర్టుకు ఒక పక్కకు చిన్న గుంత ఏర్పాడి ఆ గుంత కాస్త వర్షాలకు పెద్ద గుంతగా మారింది.రాత్రి సమయంలో ఈ గుంత కన్పించక అనేకమంది వాహనదారులు ప్రమాదాలు జరిగి ఇబ్బందికరంగా మారింది.కానీ అధికారులు మాత్రం ఇంత ప్రమాదకరంగా ఉన్న గుంతను చూసిచూడనట్లుగా వ్యవవహరిస్తున్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి వెంటనే ఈ గుంతను పూడ్చివేసి ప్రమాదాలు నివారించాల్సిన అవసరం ఉంది.

నవాబుపేట, పూడూరులో ఆధునీకరించిన ఎస్బిఐ ఏటీఎంలు ప్రారంభం

వికారాబాద్, అక్టోబర్ 19, ప్రభాతవార్త:

జిల్లాలోని నవాబుపేట, పూడూరు మండల కేంద్రాలలో బుధవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బిఐ) ఆధునీకరించిన ఏటీఎంలు అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వికలాంగులు సైతం ఏటీఎంలోకి వెళ్లి డబ్బులు తీసుకునే విధంగా రాంపులు నిర్మించినట్లు చెప్పారు. జిల్లాలో మిగిలిన ఎస్బిఐ ఏటీఎంలు త్వరలో ఆధునీకరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామకృష్ణ, చానల్ మేనేజర్ కెవిఎస్ కుమార్, బ్రాంచ్ మేనేజర్లు నీలిమ, యమున, ఏటీఎంల నిర్మాణ ప్రత్యేక అధికారి వెంకట సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునీకరించిన ఏటీఎంలను ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీ షీట్ తొలగిస్తాం

- జిల్లా ఎస్పీ ఎన్. కోటిరెడ్డి

తాండూరు, అక్టోబరు 19, ప్రభాతవార్త :

నేరచరితులు సత్ప్రవర్తనతో మెలిగితే వారిపై రైడీ షీట్ తొలగిస్తామని వికారాబాద్ జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి తెలిపారు. బుధవారం తాండూరు పట్టణంలోని సమద్ ఫంక్షన్ హాల్లట హిస్టరీ షీటర్స్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ కోటిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రౌడీ షీట్ ఉన్న వ్యక్తులు పది సంవత్సరాల పాటు ఎటువంటి నేరాలకు, నిషేధిత కార్యక్రమాలకు పాల్పడకుండా ఉంటే వారి సత్ప్రవర్తన గుర్తించి వారిపై రౌడీ షీట్ ఎత్తివేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిదంగా సత్ప్రవర్తనతో ఉండి 60 సంవత్సరాలు దాటిన నేరస్తుడి యొక్క రౌడీ షీట్ కూడ ఎత్తివేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు భవిష్యత్తులో జీవితాన్ని దృష్టిలో ఉంచుకొని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. జిల్లాలో అనుమానిత కేసుల సంఖ్య పెరుగుతోందని, ఎవరూ కూడ నేరపూరిత చర్యలకు పాల్పడరాదని తెలిపారు. 39మంది రౌడీ షీటర్లకు గానూ ఇద్దరిని సత్ప్రవర్తన పరిశీలించి రౌడీ షీట్ ఎత్తివేయాలని ఆయా పోలీస్టేషన్ అధికారులకు సూచించడం జరిగిందని తెలిపారు. అదేవిదంగా పలు కేసులలో నిందితులుగా ఉన్న 161మంది పై విచారణ జరిపించి అట్టి కేసుల విషయంలో ఆయా పోలీస్టేషన్ ఎస్‌హెచ్‌ఓల ద్వార రికార్డుల సమాచారాన్ని పరిశీలించారు. 161మందిలో 60సంవత్సరాలు దాటిన నలుగురిని, గత 10 సంవత్సరాల క్రితం చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడిన వారిలో సత్ప్రవర్తన పరిశీలించి 10మందిపై రౌడీషీట్ ఎత్తివేయాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరిపై ప్రతి అంశాలపై పోలీసు నిఘా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. నిందితులుగా ఉన్న వ్యక్తులు సత్ప్రవర్తన కలిగి శాంతిభద్రతలకు విగాధం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. నేరచరిత ఉన్న వ్యక్తులు నేరాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా తాండూరు పట్టణంలో ఇరానీ గ్యాంగ్ దోపిడి మూఠా సభ్యులను సాహసంతో పట్టుకున్న క్రైమ్ బ్రాంచ్ పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు. వారికి ప్రోత్సాహకంగా క్యాష్ రివార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ శేఖర్‌గౌడ్, సీఐలు రాజేందర్‌రెడ్డి, రాంబాబు, డిసిఆర్‌బి సిఐ అప్పయ్య, సబ్ డివిజన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ.

క్రైమ్ బ్రాంచ్ పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ.

గుంతలమయంగా మారిన కరణ్‌కోట్ రోడ్డు

- రోడ్డు బాగు చేయాలని విద్యార్థుల ఆందోళన

రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

తాండూరు, అక్టోబరు 19, ప్రభాతవార్త :

వికారాబాద్ జిల్లా తాండూరు మండల పరిధిలోని గౌతాపూర్ నుండి కరణ్‌కోట్ వెళ్లే రహదారి కూడ పూర్తిగా అధ్వాన్నంగా గుంతల మయంగా మారింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై ఉన్న గుంతలలో నీళ్లు నిలిచిపోవడంతో వాహనదారులకు ఆ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా కనిపిస్తుంది. కరణ్‌కోట్ రోడ్డు అంటేనే వామ్మో అనే పరిస్థితి నెలకొంది. ప్రతి రోజు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే విసిగిపోతున్నారు. దీంతో బుధవారం ఉదయం విద్యార్థులు కరణ్‌కోట్ రోడ్డుపైకి వచ్చి ధర్నాకు దిగారు. వెంటనే రోడ్డుకు మర్మత్తుచేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో విద్యార్థులు, గ్రామస్తులు రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టడంతో ప్రజాప్రతినిధులు స్పందించి మూడునెలలో రోడ్డు వేయిస్తామని హామి ఇచ్చారని, కాని ఏళ్లు గడుస్తున్నా రోడ్డుకు మోక్షం లభించడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తాండూరు -కరణ్‌కోట్ రోడ్డు పనులు వెంటనే ప్రారంబించి ప్రజలకు, ప్రయాణికులకు, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులకు, ఆందోళన కారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. రోడ్డుమరమ్మత్తుపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జుంటుపల్లిలో అదుపులో అతిసార,డయేరియా

-అతిసార బాధితులను పరమార్శించిన ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

యాలాల అక్టోబరు 19,ప్రభాతవార్త :

అతిసార,డయోరియా విజ్రంభనతో పలువురు ఆస్పత్రి పాలైన యాలాల మండలం జుంటుపల్లి గ్రామాన్ని బుదవారం తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పర్యటించారు.వ్యాధి బారిన పడిన పలువురు బాధితుల ఇండ్లకు వెళ్లి పరామర్శించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందన్నారు.అతిసార సోకిన 72 మంది పూర్తిగా కోలుకున్నారని ఆయన తెలిపారు.మండలంలోని 10 మందిగ్రామ కార్యదర్శులును పర్యవేక్షకులుగా నియమించినట్లు ఆయన తెలిపారు.గ్రామంలో వైద్య బృందం ఆద్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు.ముందు జాగ్రత్తలు పాటించడం వల్లే పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు.గ్రామంలో అన్ని శాఖల అధికారులు రెవెన్యూ,ఆర్‌డబ్ల్యూఎస్,వైద్యం తదితర శాఖలఅధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.వార్డుకు ఒక్కో సెక్రెటరీలను నియమించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.మిషన్ భగీరథ పైప్ లైన్‌లను పునరుద్దరించి రెండ్రోజుల్లో గ్రామంలో మంచినీటి సౌకర్యాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు.గ్రామంలో పారిశుద్య నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.గ్రామంలో అధికారులు అందుబాటులో ఉంటారని ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూస్తారని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు.అంతకు ముందు ఎమ్మెల్యే వైద్య శాఖ అధికారులతోసమీక్షా నిర్వహించి పరిస్థితిని తెలుసుకున్నారు.గ్రామంలో అతిసార బారిన పడిందని తెలుకున్న తమ నాయకులు బాలేశ్వర్‌గుప్తా,రాజుగౌడు,విఠల్‌నాయక్ తదితరులు గ్రామంలో పర్యటించి బాధితులను ఆదుకోవడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు.ప్రజలకు ఎలాంటి సహాయం చేయని బిజెపి నాయకుల విమర్శలు,ఆరోపణలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి బాలేశ్వర్‌గుప్తా,గ్రంధాలయ చైర్మన్ రాజుగౌడు,మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్‌నాయక్‌కోఅప్షన్ సభ్యులు అక్బర్‌బాబా,వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపిటిసిలు,నాయకులు,కార్యకర్తలు,అధికార యంత్రాంగం తదితరులు ఉన్నారు.

జుంటుపల్లిలో అతిసార బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పంటపొలాలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

రైతులను సన్మానిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

దౌల్తాబాద్,అక్టోబర్ 19,ప్రభాతవార్త:

వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి గ్రామానికి చెందిన పల్లె సాయిరెడ్డి(రైతు) వ్యవసాయ పొలంలో వాసన్‌సంస్థ ఆధ్వర్యంలో సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటపొలాలను బుధవారంరోజు వ్యవసాయ శాస్త్రవేత్తలు అయిన ఇన్స్‌స్టూట్‌ఆఫ్ రైస్ రిసర్చ్ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ మహేందర్‌కుమార్,డాక్టర్ గిరీష్ పాల్గొని ప్రకృతి వ్యవసాయంలో భాగంగా 46 రకాల దేశీయ వరి పంటను పరిశీలించారు.ఈ సంధర్భంగా ప్రకృతి వ్యవసాయం యొక్క ఆవశ్యకతను,గత మూడు సీజన్‌ల నుండి ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో వరి సాగు చేస్తున్న రైతుల అనుభవాలను వారు ఎదుర్కొంటున్న సమస్యలను,పంటల యొక్క దిగుబడులు, మార్కెటింగ్‌ల గురించి రైతులను అడిగి వారు తెలుసుకున్నారు.అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో దేశీయ వరి రకాల పంటలను సాగు చేస్తున్న రైతులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి, ఉదయ్,అనిల్,లక్ష్మణ్,గోపాల్,సత్యం,బుగ్గప్ప,వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన

ఎన్ఎఫ్‌సీనగర్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమీషనర్ వేమనరెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త:

ప్రజలు తడిచెత్త, పొడిచెత్తలను వేరు చేసి మున్సిపల్ చెత్త ఆటో సిబ్బందికి అందజేయాలని మున్సిపల్ కమీషనర్ పి.వేమనరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 1వ వార్డులోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో బుధవారం స్వచ్ఛసర్వేక్షన్ 2023లో భాగంగా స్థానిక కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు తడిచెత్త, పొడిచెత్తలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కమీషనర్ వేమనరెడ్డి హాజరై మాట్లాడుతూ పట్టణంలో ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు.ప్రజలు తమ ఇళ్లలో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఆకుపచ్చ, నీలం రంగు బుట్టలలో వేసి ఇంటికి వచ్చే చెత్త సేకరణ ఆటోలో వేయాలని ఆయన సూచించారు. మున్సిపాలిటీకి వరుసగా 3వ సారి స్వచ్ఛసర్వేక్షన్ అవార్డు రావడానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు. మున్సిపల్ మేనేజర్ మర్రి అంజిరెడ్డి, ఆర్‌పిలు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వెటరన్ క్రీడాకారుడు మర్రి లక్ష్మణ్‌రెడ్డికి సన్మానం

మర్రి లక్ష్మణ్‌రెడ్డిని సన్మానించిన మాజి ఎంపిపి పద్మజగన్‌రెడ్డి

మేడ్చల్, అక్టోబర్ 19. ప్రభాతవార్త ః వెటరన్ క్రీడాకారుడు, ఎంఎల్ ఆర్‌ఐటి చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి క్రీడాకారులకు, యువతకు ఆదర్శమని మేడ్చల్ మాజి ఎంపిపి పద్మజగన్‌రెడ్డి అన్నారు. మహారాష్ట్రలో జరిగిన 1.5 కిలోమీటర్ల స్విమ్మింగ్‌ను లక్ష్మణ్‌రెడ్డి విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను మండల పరిధి గౌడవెల్లిలోని సాకెత్ భూసత్వ గృహ సముదాయంలో మాజి ఎంపిపి ఘనంగా సన్మానించారు. లక్ష్మణ్‌రెడ్డి వయస్సు మీరినా కూడ క్రీడలకు దూరం కాకుండా ఉండటంతోనె ఆరోగ్యంగా ఉన్నారని. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఎదో ఒక క్రీడలో రాణించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజి సర్పంచ్ జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు ప్రచారంలో మేడ్చల్ నేతలు

మేడ్చల్, అక్టోబర్ 19. ప్రభాతవార్త ః

మునుగోడు ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డితో కలిసి మేడ్చల్ మండల నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేడ్చల్ మండల ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి, జడ్పిటిసి శైలజ విజయనందరెడ్డి, గుండ్లపోచంపల్లి మేడ్చల్ మున్సిపాలిటీల చైర్ పర్సన్‌లు లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి, దీపిక నర్సింహారెడ్డి, మాజి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గీత మధూకర్, రమాదేవి తదితరులు మునుగోడుకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి టీఆర్ఎస్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ఎక్కడ చూసిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపొందడం ఖాయమని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

మంత్రి మల్లారెడ్డితో కలిసి మునుగోడులో ప్రచారం నిర్వయిస్తున్న మేడ్చల్ నేతలు

'కారు' వదిలి 'కమలం' గూటికి .!

- బిజెపిలో చేరిన మాజీ గ్రంథాలయ చైర్మన్ మురళీగౌడ్

- మాజీ మంత్రి తనయుడు నరేష్ మహారాజ్

బీజేపీలో చేరిన తాండూరు నేతలు.

తాండూరు, అక్టోబరు 19, ప్రభాతవార్త :

వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన ఇద్దరు టిఆర్ఎస్ నేతలు కారును వదిలో కమలం గూటికి చేరారు. జిల్లా మాజీ గ్రంథాల సంస్థ చైర్మన్ మురళీ కృష్ణగౌడ్‌తో పాటు దివంగత మాజీ మంత్రి తనయుడు, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.నరేష్ మహారాజ్ బీజేపీలో చేరారు. బుధవారం ఢిల్లీలో బీజేపీ నేత జెపీ నడ్డా సమక్షంలో బీజేపీ పార్టీ కండువాకప్పుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భూపేంద్ర యాదవ్, లక్ష్మణ్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, రాష్ట్ర ఇంచార్జ్ తరుణ్‌చుగ్ ఎమ్మెల్యే ఈటెల రా జేందర్, డీకే అరుణ. సంకినేని వెంకటేశ్వరరావు, బుర్ర నర్సయ్యగౌడ్, మా జీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావుల ఆద్వర్యంలో టీఆర్ఎస్‌ను వీడి వారు బీజేపీలో చేరారు.

సుల్తాన్‌పల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

-శంషాబాద్ మొయినాబాద్ మండలాల మధ్యన నిలిచిపోయిన రాకపోకలు

భార్షీ వర్షంతో నీట మునిగిన వంతెన దృశ్యం

శంషాబాద్ అక్టోబర్19,ప్రభాతవార్త :

మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సుల్తాన్‌పల్లి వద్ద వాగు పొంగి పోర్లుతుండడంతో హిమాయత్ సాగర్ చెరువుకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది.సుల్తాన్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కెబి దోడ్డి గ్రామం వద్ద వంతెన పై నుండి వరద నీరు ప్రవహిస్తుండడంతో మొయినాబాద్ శంషాబాద్ మండలాల మధ్యన సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి.అటు నుండి ఇటు ఎటు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.మంగళవారం రాత్రి శంషాబాద్, నానాజీపూర్, మల్కారం, రాయన్నగూడ రామంజపురం, షాబాద్,మండలం లోని పలు గ్రామాల్లో కురిసిన భారీ వర్షంతో వరద పోటెత్తింది.ఇటీవల ఎన్న డూ లేని విధంగా అతి భారీ వర్షం కురవడంతో అమడాపూర్ కెపి దొడ్డి గ్రా మాల మధ్యన ఉన్న వంతెన అసలు కనిపించకుండా మారింది.

భారత మాజీ కెప్టెన్ అజారుద్దిన్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ



అజారుద్దిన్‌ను పరామర్శిస్తున్న ఎంఎల్‌సి

పెద్దేముల్, అక్టోబరు 19, ప్రభాతవార్త:

భారత క్రికెట్ మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దిన్‌ను మాజీ మంత్రి, ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి పరామర్శించారు. అజారుద్దిన్ తండ్రి అజిజుద్దిన్ మృతిచెందడంతో బుదవారం హైద్రాబాద్‌లోని వారి కుటుంబాన్ని ఎంఎల్‌సి పరామర్శించి తమ ప్రగాడ సానుభూతిని వ్యక్తంచేశారు. ఎంఎల్‌సి వెంట పెద్దేముల్ ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, రెగొండి సర్పంచ్ హైదర్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ బిసిలకు కేటాయించాలి

- బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్

తాండూరు, అక్టోబరు 19, ప్రభాతవార్త : వికారాబాద్ జిల్లా తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్‌ను మార్చాలని, మార్కెట్ కమిటీ చైర్మన్ బీసీలకు కేటాయించాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తాండూరు నియోజకవర్గంలో 65శాతం మంది బీసీలు ఉన్నారని ఆయన అన్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డితో స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చర్చించి ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఓసీ రిజర్వేషన్‌ను తొలగించి నూతన పాలక వర్గంలో బీసీలకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చోటు కల్పించాలని కోరారు. తాండూరు ప్రాంతంలో ఎక్కువ మంది బీసీలే వ్యవసాయంపై అధారపడి ఉన్నారని, ఇందకు అనుగుణంగా బీసీలకు మార్కెట్ కమిటీ పాలకమండలిలో స్థానం కల్పిస్తే బీసీలకు సమన్యాయం జరుగుతుందని రాజ్‌కుమార్ అన్నారు.

తాండూరు ప్రాంతంలో బిజెపితోనే అభివృద్ధి

- పట్టణ అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్

తాండూరు, అక్టోబరు 19, ప్రభాతవార్త : తాండూరు ప్రాంతం బీజేపీతోనే అభివృద్ధి చెందుతుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ .ఎండా ఎగురవేయడం ఖాయమని బీజేపి పట్టణ అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ పార్టీలో బలమైన నాయకులు జిల్లా మాజీ గ్రంథాల సంస్థ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌తో పాటు దివంగత మాజీ మంత్రి తనయుడు, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.నరేష్ మహారాజ్ టిఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా యువతలో చైతన్యం నింపుతూ రాజకీయాలలో చురుకుగా పనిచేస్తున్న నేతలు బీజేపీలో చేరడం యువతలో మరింత ఉత్సాహం నింపుతుందని అన్నారు. తాండూరులో బీజేపీ బలం పుంజుకుంటుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తాండూరులో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఉపన్యాస వ్యాసరచన పోటీలు

కొడంగల్,అక్టోబర్19,ప్రభాతవార్త ః

పోలీస్ అమరవీరుల దినోత్సవంను పురస్కరించుకోని పట్టణంలోని లాహోటీ డిగ్రీ కళాశాలలో 9,10వ తరగతి విద్యార్థులకు ,,సమాజంలో శాంతి భద్రతలపై పోలీసులపాత్ర,, అనే అంశంపై ఉపన్యాన,వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది.వ్యాసరచన పోటీలో మొదటి బహుమతి నవ్యచందన జడ్‌పిఎచ్ఎస్ దుద్యాల్,రెండవ బహుమతి అంజిలయ్య ఎంజేపిజేటీ కొడంగల్,ఉపన్యాస పోటీలో నందిని జడ్‌పిఎచ్ఎస్ దుద్యాల్,రెండవ బహుమతి సుగ